వీర జవాన్ కార్తీక్ తల్లిదండ్రులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్

ఘనంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- 317 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్, యంత్రాంగం: 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా ఆదివారం చిత్తూరు పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో జాతీయ పతాకాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు, జూనియర్ సివిల్ జడ్జ్ ఎస్.శ్రీనివాసరావు, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్ రావు, ఎస్‌పి మణికంఠ చందోలు, నగర మేయర్ అముద, పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీ మోహన్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఎఫ్‌ఓ భరణి, డిఆర్‌ఓ కె.మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొదట జమ్మూలో ఉగ్రవాదుల దాడులలో వీరమరణం పొందిన బంగారుపాళ్యం మండలం ఎగువ రాగి మాని పెంట కువరదరాజులు,సెల్వి దంపతుల కుమారుడు పంగల కార్తిక్ యాదవ్ కుటుంబానికి జిల్లా యంత్రాంగం తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పంగల కార్తిక్ యాదవ్ తల్లిదండ్రులను, స్వాతంత్ర సమరయోధులు టిసిరాజన్ కలెక్టర్, ఎస్పీ, జెసి, డిఎఫ్‌ఓలు సన్మానించారు. గణతంత్ర దినోత్సవంపై ప్రసంగించిన గాబ్రియల్ స్కూల్ 3వ తరగతి విద్యార్థి చిన్నారి అమీనాను కలెక్టర్, ఎస్పీ ప్రశంసించారు. అనంతరం శకటాల ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన శాఖలకు సాంస్కృతిక ప్రదర్శనలో విశేష ప్రతిభ కనపరచిన పాఠశాలలో విద్యార్థులకు మెమెంటులను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కలెక్టర్ ఎస్పి, నగర మేయర్ చేతుల మీదుగా విధులలో ఉత్తమమైన ప్రతిభ కనపరచిన 317మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాల బహూకరణ చేశారు. వివిధ శాఖల ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్, ఎస్‌పి, ఇతర అతిథులు పరిశీలించి, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ చేశారు. ఉద్యానశాఖ ద్వారా సమగ్ర ఉద్యాన మిషన్ కింద ముదురు మామిడి తోటల పునరుద్ధరణ పథకం కొరకు 1,652 మంది మామిడి రైతులకు రూ.2.25 కోట్ల మెగా చెక్కును పంపిణీ చేశారు. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ 'దీపం-2' పథకం కింద ప్రతి దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) ప్రతి కుటుంబానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నారు. ఇప్పటివరకు 3,17,158 కుటుంబాలు లబ్ధిపొందాయి. ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు రూ. 25.58 కోట్ల ఖర్చు చేయడం జరిగిందని, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద కొత్త ప్రభుత్వం పెన్షన్ మొత్తాన్ని పెంచింది. వద్ధాప్య పెన్షన్ రూ. 4,000కి పెంచారు. వికలాంగులకు రూ. 6,000 పెంచారు. మంచానికే పరిమితమైన పక్షవాత వ్యాధిగ్రస్తులకు, తీవ్రమైన కండరాల బలహీనత, ప్రమాద బాధితులకు రూ.15,000కి పెంచడమైనది. ఈ పెన్షన్ కార్యక్రమం ద్వారా చిత్తూరు జిల్లాలో 2,66,000 కుటుంబాలు లబ్ధి పొంతున్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితే, దేశం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రతి గ్రామంలో అభివద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా

76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

1609 సీసీ రహదారులు రూ.110 కోట్ల వ్యయంతో ప్రారంభించాం. ఇప్పటి వరకు 1,150 పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన పనులు మార్చి నాటికి పూర్తి చేస్తాం. అదనంగా ఈ పథకం కింద 2,108 గోకులం షెడ్లు ఆమోదించబడ్డాయి, వీటి అభివద్ధి కోసం రూ. 50 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఈ జాతీయ రహదారుల సంస్థ ద్వారా చిత్తూరు-తచ్చూర్ జాతీయ రహదారి పనులు రూ. 3,800 కోట్ల వ్యయంతో జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టు 2025 జూన్ నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకునివస్తాం. మరో ప్రధాన ప్రాజెక్ట అయిన చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిని రూ. 5,000 కోట్ల వ్యయంతో 2026 మార్చి నాటికి పూర్తికానున్నది. చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్ రావు ఎంపీల్యాడ్ పథకం కింద రూ.5కోట్ల నిధులు మంజూరు చేశారని చెప్పారు.

లబ్ధిదారులకు రూ.1354.37 కోట్ల ఆస్తుల పంపిణీ

76 గణతంత్ర వేడుకల్లో వ్యవసాయ శాఖ, ఉద్యాన, డ్రిప్ ఇరిగేషన్, పశు సంవర్ధక శాఖ, పట్టు పరిశ్రమలు, జెడ్పి, డిపిఒ, డిఆర్డీఏ, డ్వామా, మెప్మా, ఐసిడిఎస్, డిఎంహెచ్ఓ, సమాచారశాఖ, హౌసింగ్, జిసిసి, పోలీస్, అగ్నిమాపక శాఖల స్టాల్స్‌ను పరిశీలించారు. వివిధ శాఖల ద్వారా లబ్ధిదారులకు రూ.1,354.37 కోట్ల ఆస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా డిఆర్‌డిఏ ద్వారా జిల్లాలోని 9,897 స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ.921.41 కోట్లు, 27,298 మంది స్వయం సహాయక సంఘ మహిళలకు స్త్రీ నిధి కింద రూ.179.48 కోట్ల మొత్తం రూ.1,100.89 కోట్ల మెగా చెక్కులను పంపిణీ చేశారు. మెప్మా ద్వారా 17,610మంది స్వయం సహాయక సంఘ మహిళలకు రూ.253.44 కోట్లు మెగా చెక్కును అందించారు. ఉద్యానశాఖ ద్వారా సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ కింద 6 మందికి రూ.4 లక్షల విలువైన మినీ ట్రాక్టర్, పవర్ టిల్లర్, తదితర వ్యవసాయ ఉపకరణాలను అందించారు.

మొదటి బహుమతి అందుకున్న వ్యవసాయ శాఖదే

76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా శకటాల ప్రదర్శనలో భాగంగా మొదటగా ప్రజల సంరక్షణలో భాగంగా పోలీస్ వారు తీసుకుంటున్న వినూత్న కార్యక్రమాలను తెలియజేసేలా జిల్లా పోలీస్ శాఖ శకటాన్ని ప్రదర్శించారు. అనంతరం విపత్తులు సంభవించిన సమయంలో ఆత్మరక్షణ విధానాలను తెలుపుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖకు చెందిన మిస్ట్ బుల్లెట్, మిస్ట్ జీపు, రెస్క్యూ టెండర్ శకటాలను ప్రదర్శించారు. మూడవదిగా

సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభచాటిన విద్యార్థులతో జిల్లా కలెక్టర్, ఎస్పీ

దేవాదాయ శాఖచే కాణిపాకం దేవస్థానం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి విశిష్టతలను తెలుపుతూ శకటంను ప్రదర్శించారు. తదుపరి వైద్య ఆరోగ్య శాఖకు చెందిన డాక్టర్ ఎన్.టి.ఆర్ వైద్య సేవా ట్రస్ట్, చంద్రన్న సంచార ఆరోగ్య పథకం, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, 108, 104 శకటాలను ప్రదర్శించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం, సర్వేపల్లిల రాధాకృష్ణ విద్యామిత్ర స్టూడెంట్ కిట్స్, మన బడి - మన భవిష్యత్తు వంటి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను వివరించేలా విద్యాశాఖ రథాలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు తెలుపుతూ వ్యవసాయశాఖ శకటం, ప్రధాన మంత్రి సూర్యఘర్ (సోలరైజేషన్) శకటాలు సాగిపోయాయి. వ్యవసాయ శాఖ మొదటి విజేతగా నిలువగా, విద్యా శాఖ, సోలరైజేషన్ (ప్రధాన మంత్రి సూర్య ఘర్) శాఖలు రెండు, మూడవ బహుమతులను కైవసం చేసుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థుల నాట్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకున్నాయి.

విజయం సిబిఎస్‌ఇ స్కూల్ క్యాంపస్‌లో ఛైర్మన్ డాక్టర్ ఎం. తేజోమూర్తి, అకడమిక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శైలజామూర్తి, విజయం పాఠశాల, విజయం సిబిఎస్ఇ పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల, ఎంబిఎ-ఎంసీఏ కళాశాలల ప్రిన్సిపాళ్లు జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ గీతాలాపనతో దేశభక్తి ఉట్టిపడేలా కార్యక్రమం గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అలాగే బృందావన్ సీనియర్ సెకండరీ పాఠశాలలో పాఠశాల వ్యవస్థాపకులు గౌరవనీయులు శైలజ కుమారి, వైస్ ప్రిన్సిపాల్ ప్రియాతేజ ఆధ్వర్యంలో 76 వ గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నగరపాలక కార్యాలయంలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాద్ రావు, నగర కమిషనర్ పి నరసింహ ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. స్థానిక డిసిసిబి బ్యాంకు ఆవరణంలో డిసిసిబి సిఈఓ మనోహర్‌గౌడ్ జాతీయ పథాన్ని ఆవిష్కరించారు.

పెద్దపంజాణి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు పాఠశాలల్లో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాల మహానాడు మండల అధ్యక్షుడు మంజునాథ్ అంబేద్కర్‌కు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండల అధ్యక్షుడు మంజునాథ్, ఎంపీపీ ఎన్.రెడ్డప్ప,ఎంపీడీవో బాలాజీ పాల్గొన్నారు.

గంగవరం: మండలం నడింపల్లి గ్రామంలోని అక్షర ఫౌండేషన్ ఫౌండర్ గాయత్రి ఆధ్వర్యంలో ఆశాజ్యోతి దివ్యాంగుల పేద ప్రజల సేవా సంస్థ కమిటీ సభ్యులు, రిమ్మర్స్ మానసిక దివ్యాంగుల సంస్థ, అక్షర ఫౌండేషన్‌లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు స్వీట్లు, పండ్లు పంచిపెట్టడం జరిగింది. మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ వెంకటరమణ జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రసాద్ తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ గురునాథ్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం జరుపుకున్నారు

గంగాధరనెల్లూరు: స్థానిక హైస్కూల్లో ఎమ్మెల్యే విప్ డాక్టర్ థామస్ జాతీయ జెండాను ఎగరవేశారు. రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ చంద్రశేఖర్, పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ లక్ష్మి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, జైన్ ఫ్యాక్టరీలో మేనేజర్ సమీర్ శర్మ, తూగుండ్రం హైస్కూల్లో హెచ్ఎం రాజేంద్రనాయుడు, తూగుండ్రం బజారు వీధిలో జీవరత్నం, ఎంఈఓ ఆఫీసులో ఆంజనేయులు శెట్టి జాతీయ జెండాను ఎగురవేసి విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ

వెదురుకుప్పం: ఎంపీడీవో కార్యాలయంలో అమర్నాథ్ జెండా ఎగురవేసి చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. అలాగే డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద, లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఏ.సి.భరణినాథ రెడ్డి ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని బీజే మోడల్ స్కూల్‌లో బెంగుళూర్‌కు చెందిన అన్నపూర్ణ ట్రస్ట్ చైర్‌పర్సన్ విజయమ్మ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేసి విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కరస్పాండెంట్ కె.మోహన్, హెడ్మాస్టర్ దివ్య ప్రసన్న పాల్గొన్నారు.

కార్వేటినగరం: అమరవీరుల త్యాగఫలమే నేడు జరుపుకుంటున్న గణతంత్ర దినోత్సవమని మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ అన్నారు. ఆదివారం రిపబ్లిక్ డేను పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలో మండల విద్యావనరుల కార్యాలయం, పంచాయతీ కార్యాలయాల్లో త్రివర్ణ పతాకాలను ఎగుర వేసి 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుకున్నారు.

పుంగనూరు: పట్టణంలో మాజీ సైనికుల కార్యాలయంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి, ఆ సంఘ గౌరవ అధ్యక్షుడు కేసు కుమార్ బాబు మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అలీమ్ బాష, కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తులు, అర్బన్ సర్కిల్ కార్యాలయంలో సీఐ శ్రీనివాసులు, ఎంఆర్‌సిలో ఎంఈఓలు చంద్రశేఖర్ రెడ్డి, రెడ్డన్న శెట్టి, ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రాము, శుభరాం డిగ్రీ కళాశాల ఆవరణంలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ జాతీయ జెండాను ఎగురవేశారు.

గుడిపాల: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శివరాజ్, తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ గణపతి, పోలీస్ స్టేషన్లో ఎస్సై రామ్మోహన్, ప్రభుత్వాసుపత్రిల్లో డాక్టర్లు రశ్మిత, సంధ్య, వెలుగు కార్యాలయంలో ఏపీఎం సుధారాణి, సిఎన్ఆర్ కళాశాలలో కరస్పాండెంట్ లోకేష్, వసంతాపురం పాఠశాలలో సర్పంచ్ రజనీకాంత్ జాతీయ జెండాలను ఎగురవేశారు.

సదుం: తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మారూఫ్ హుస్సేన్, ఎంపీడీవో కార్యాలయంలో డిఎస్.హరిబాబు ఆధ్వర్యంలో ఎంపీపీ ధనుంజయ రెడ్డి, పోలీస్‌స్టేషన్లో ఎస్సై షేక్ షావలి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బి.సుబ్రమణ్యం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్పకుమారి, చెరుకువారిపల్లి పీహెచ్సీలో డాక్టర్ గిరీష జెండా ఎగురవేశారు.

రామకుప్పం: మండలంలో వాడవాడల 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం, వివిధ శాఖ కార్యాలయాలు, ప్రాథమిక ఆసుపత్రులు, ప్రవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపీడీఓ మురళీధర్, తహసీల్దార్ బాబు, డిప్యూటీ తహశీల్దార్ బాలాజీ, ఆర్ఐ నారాయణ జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు.

రొంపిచర్ల: తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో కిరణ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో డాక్టర్ దినేష్‌కుమార్ నాయక్, పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, ఎంఈఓలు ఎన్.ఇందిరా, శ్రీనివాసులు, ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ సరళ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

కుప్పం టౌన్ : పురపాలక సంఘం, పలు ప్రభుత్వ కార్యాలయాలలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ద్రావిడ విశ్వవిద్యాలయంలో విద్యాసంస్థల అధినేతలు, కళాశాల ప్రిన్సిపల్, విశ్వవిద్యాలయ ఉపకులపతి జెండా ఆవిష్కరణ గావించారు.

సోమల: మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వ కార్యాలయాలలో జూనియర్ కళాశాలలో జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ బెన్ను రాజ్, ఎంపీడీవో నారాయణ, ఏవో సుధాకర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు, ఏపీవో దినకర్ బాబు గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

కుప్పం రూరల్ : పట్టణ పరిధిలో దళిత యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో సేవా సంఘం అధ్యక్షులు కన్నన్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

బంగారుపాళ్యం: తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, పోలీస్ స్టేషన్లో సిఐ శ్రీనివాసులు, విద్యాశాఖలో ఎంఈఓ నాగేశ్వరరావు, ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీధర్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెండాను ఎగరవేశారు.

తవణంపల్లి: తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సుధాకర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రెడ్డిబాబు, జెడ్పిటిసి భారతి మధు కుమార్, పోలీస్ స్టేషన్ ఎస్ఐ చిరంజీవి, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగురవేశారు.

పలమనేరు: మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి జాతీయ జెండాను ఎగుర వేశారు. పోలీసు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఎంపీడీవో, సచివాలయ, కళాశాలలు, పాఠశాలలు అన్ని కార్యాలయాలలో గణతంత్ర వేడుకలు జరుపుకున్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు

చిత్తూరు నగర కమిషనర్ నరసింహా ప్రసాద్

డీఈఒ వరలక్ష్మి

ఎస్‌పిడిసిఎల్ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఉత్తమ సేవలందించిన జిల్లా అధికారులకు 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం పోలీస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో జిల్లా కలెక్టర్, జిల్లాఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే స్వతంత్ర సమరయోధులు టిసి రాజన్, ఇటీవల ఉగ్రవాదుల కాల్పుల్లో అమరుడైన కార్తిక్ తల్లిదండ్రులను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సన్మానించారు. 76వ గణతంత్ర వేడుకల్లో ఉత్తమ సేవలందించిన వివిధశాఖ అధికారులు, సిబ్బంది 317 మందిని సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

వెదురుకుప్పం మండలం దేవరగుడిపల్లి పంచాయితీ కార్యదర్శి మధు కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసాపత్రం అందుకున్నారు. పలమనేరు నుంచి ఏఎంసి అధికారి సంజీవి కలెక్టర్ నుండి ఉత్తమ ఉద్యోగ ప్రశంసా పత్రం అందుకున్నారు. యాదమరి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిత్తూరు టర్మినల్ ఐఓసీల అధికారి అరుణ్ ప్రసాద్‌కు ఉత్తమ ప్రతిభా పురస్కారాన్ని ఐఓసీఎల్ చీఫ్ టర్నల్ మేనేజర్ అమితవ సర్దార్ అందించారు. పుంగనూరు మండల సర్వేయర్ బి.శ్రీనివాసులు నాయక్‌కు 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా ప్రశంస పత్రాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. గుడిపాల మండలంలోని ఎంపీడీవో శివరాజ్, తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డికి ఉత్తమ అధికారులుగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గణతంత్ర వేడుకల్లో ప్రశంసా పత్రాలను అందించారు. శాంతిపురం ఎంపీడీవో ఏ ప్రేమ్ రాజ్ కుమర్ చిత్తూరు జిల్లా కాలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు అందుకున్నారు.

డ్వామా పీడీ రవికుమార్



పలమనేరు ఉద్యోగులు

ఉద్యానవనశాఖ డిడి మధుసూదనరెడ్డి

వెదురుకుప్పం మండలం దేవరగుడిపల్లి పంచాయితీ కార్యదర్శి మధు

పుంగనూరు మండల సర్వేయర్ బి.శ్రీనివాసులు నాయక్

డి ఆర్ డి ఏ వెలుగు కార్యాలయం ఏపీఎం హరిప్రసాద్

శాంతిపురం ఎంపీడీవో ఏ.ప్రేమ్‌రాజ్ కుమార్

చిత్తూరు టర్మినల్ ఐఓసీఎల్ అధికారి అరుణ్ ప్రసాద్

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పలమనేరు : పట్టణంలోని ఈద్గాలో సాయిరాం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో ఆదివారం ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ వైద్యశిబిరంకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా పదిమందికి పైగా ప్రముఖ వైద్యులు వివిధ రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పలమనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అక్కడి సేవలను పరిశీలించి హెల్త్ క్యాంప్ నిర్వాహకులను అభినందించారు. అదేవిధంగా పలమనేరు లారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్, ప్రభుత్వ ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. వైద్యులు యుగంధర్, శారదమ్మ, మల్లికార్జున రెడ్డి, లారీ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జిలానీ, టీడీపీ నాయకులు గిరిబాబు, ఖాజా, నాగరాజు, చాంద్ బాషా ఉన్నారు.

నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డుపై హర్షం..!

ప్రజాశక్తి - రామకుప్పం: సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడం పట్ల మండల టిడిపి నేతలు, అభిమాన సంఘ నేతలు హర్షం వ్యక్తం చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను పద్మభూషణ్ అవార్డును బాలకృష్ణకు అందించడం ఆనందదాయకమన్నారు. చలనచిత్ర రంగంలో విశేష సేవలు అందించినందుకు గాను కేంద్ర ప్రభుత్వం గుర్తించి ఈ అవార్డు ప్రధానం చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. మరెన్నో ఇటువంటి అవార్డులను నటుడు బాలకృష్ణ అందుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర టిడిపి నేతలు మునస్వామి, నారాయణాచారి, రామ్మూర్తి, చలపతి, చిన్ని కృష్ణ, సీతాపతి, జయశంకర్, కృష్ణ నాయక్, విశ్వనాథ్, వెంకటాచలం, బాలు, బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షులు సుబ్రి, అవినాష్ ,వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు.

బలిజ అభ్యుదయ సేవా సంఘం

14వ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- పలమనేరు: స్థానిక పిజెసి కళ్యాణ మండపం వద్ద ఆదివారం పలమనేరు బలిజ అభ్యుదయ సేవా సంఘం (బాస్) 14వ వార్షికోత్సవం వేడుకలు పలమనేరు బాస్ గౌరవాధ్యక్షులు ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలిజ కులస్తులందరూ ఐకమత్యంతో ఉండాలని, అందరి సహకారంతోనే ఇలాంటి కార్యక్రమాలు విజయవంతం అవుతున్నాయని తెలిపారు. అనంతరం మాజీ అధ్యక్షులు పిజెసి బాబు, కొత్త ప్రెసిడెంట్ రూపేష్ కిరణ్, దైవప్రసాద్, గాజుల చంద్ర, ఏకే మూర్తిలను సన్మానించారు. అన్నదాన ధర్మకర్త డాక్టర్ ఆకుల గజేంద్రప్రసాద్ భోజన వసతిని ఏర్పాటు చేశారు. బాగా చదువుకున్న పిల్లలకు వారిని ప్రోత్సహించేందుకు నగదు బహుమతిని అందించారు. కటారి హేమలత, ఆవుల రమేష్, చరణ్, విజయ్ కుమార్, ఊకా విజయ్ కుమార్, గణేష్, మణి, ముత్యాల నాయుడు, ప్రభాకర్, ఆంజనేయులు, గోపి రాయల్, గోపి, ప్రెసిడెంట్ రూపేష్, దైవప్రసాద్, గాజుల చంద్ర, శ్రీధర్, కిరణ్, ఓకే మూర్తి, నరేష్, అరుణ్, సుబ్బ నాగయ్య, చెంచు రెడ్డి, రామ్మూర్తి, డాక్టర్ జనార్ధన్ పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బి ఎన్ కండ్రిగ మండలం పుత్తేరి ప్రాథమిక పాఠశాలకు గ్రామ సర్పంచ్ రామ్మూర్తి తనయుడు పార్థసారథి రిపబ్లిక్ డే సందర్భంగా, విద్యార్థుల సౌకర్యార్థం ప్రింటర్‌ను వారి జ్ఞాపకార్థం బహూకరించారు. ఈ ప్రధానఉపాధ్యాయులు రాజ్ కిరణ్, ఉపాధ్యాయులు మురళి, చైర్మన్ గాయత్రి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ భూముల్లో గ్రావెల్ అక్రమ తరలింపు

అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి గ్రామం అటవీ ప్రాంతంలో గ్రామానికి కూసింత దూరంలో గ్రావెలు, రాతి బండలతో నిండిన ఓ కొండ వుంది. పెన్నేపల్లి (తిప్పని)కొండ అని పిలుస్తారు, నాలుగు రోజుల నుండి కొండ దిగువభాగాన రాత్రి పగలు తేడా లేకుండా యంత్రాల సాయంతో రోజు వందల ట్రక్కులు తరలిస్తుండడంతో సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆదివారం స్థానికులు అడ్డుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలు ఫారెస్ట్ రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీనివాసులు సంఘటనా స్థలం చేరుకుని వెహికల్ అదుపులోకి తీసుకొని జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ కు సమాచారం అందించారు. జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ డివి .రమణయ్య ను ప్రజాశక్తి ప్రతినిధి వివరణ కోరగా ఆయన 20 వేలు రూపాయలు ఫైన్ వేసి వెహికల్‌ను విడుదల చేసినట్లు తెలిపారు.

వాకర్స్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుమల బైపాస్ రోడ్డు తిరుపతి ప్రకాశం మున్సిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా గోపీనాథ్, కార్యదర్శిగా పి.చంద్రకాంత్ లు ఎన్నికయ్యారు. ఆదివారం పార్క్ లో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. టీటీడీ ఉద్యోగ సంఘాల మాజీ నాయకులు టి.దాసు, బీసీ సంఘాల నాయకులు కేశవులు ఉడయార్, జర్నలిస్ట్ కోలా లక్ష్మీపతి ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులు ఎన్నికైనట్లుగా ప్రకటించిన అనంతరం మిగిలిన కమిటీ సభ్యుల ఎన్నిక 15 రోజుల్లోగా ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ప్రకాశం మున్సిపల్ పార్కులో ప్రతినిత్యం వాకింగ్ చేసే మిత్రుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, పార్కులో అభివృద్ధి పనులను మెరుగుపరుచుకోవాలని, నూతన వాకర్స్ కు అసోసియేషన్లో సభ్యత్వం అవకాశం కల్పించాలని వాకర్స్ నాయకులు తీర్మానించారు. గతంలో అధ్యక్షులుగా పనిచేసిన వెంకటరెడ్డి, ఎర్రం రెడ్డి లను సభ్యులు దుశ్శాలువతో సన్మానించారు. అసోసియేషన్ నాయకులు బి లక్ష్మయ్య యాదవ్, మురళీమోహన్, జగన్నాథం, రాజేశ్వరి, సుబ్బయ్య, మధుబాబు, ముని రెడ్డి, మునిబాబు, బలరామిరెడ్డి, రఘునాథ బాబు, తన్నీరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాజీ జెడ్పిటిసి మృతికి నివాళి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మాజీ జెడ్పిటిసి సభ్యులు, జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షులు వెంకటేష్ గతవారం మరణించారు. ఆదివారం గంగాధర నెల్లూరులో వెంకటేష్ సంస్మరణ కార్యక్రమం సందర్భంగా చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ వెంకటేష్ చిత్రపటానికి నివాళు లర్పించి వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. టిడిపి పార్లమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి కృష్ణమ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, నియాజ్ అలీ, దీపక్ నాయుడు, జనసేన ఇంచార్జ్ పొన్న యుగంధర్ పాల్గొన్నారు.

వెంకటేష్ చిత్రపటానికి నివాళ్ళు అర్పిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే

వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్ళపల్లిలో బి.నరసింహారెడ్డి ఆకస్మిక మృతి చెందిన విషయం తెలుసుకున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కృపా లక్ష్మి ఆదివారం స్థానిక నాయకులుతో కలిసి నరసింహారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

నివాళ్ళు అర్పిస్తున్న కృపాలక్ష్మీ

కూతురిపై లైంగిక దాడి

పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: కూతురు వరసైన చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం మల్లంగుంట గ్రామంలో ఈశ్వర్ రెడ్డి (32) భర్తను వదిలేసిన వివాహితను ఆరు నెలలు క్రితం వివాహం చేసుకున్నాడు. వివాహితకు 12 సంవత్సరాల వయసు వున్న కుమార్తె వుంది. ఈనెల 12వ తేదీ ఈశ్వర్ రెడ్డి భార్య మొదటి భర్త కుమార్తె బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని కుమార్తె తల్లికి చెప్పింది. దీంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఎంఆర్ పల్లి పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచల అడవుల నుండి అక్రమంగా తరలిస్తున్న 15 ఎర్రచందనం దుంగలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. తిరుపతి రేంజి ఆఫీసర్ సుదర్శన్ రెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు మామండూరు సెక్షన్ అధికారులతో కలిసి ఆదివారం తెల్లవారుజామున రేణిగుంట పరిధిలో వాహన తనిఖీలను నిర్వహించారు. క్వాలిస్ వాహనం అది వేగంగా రావడానికి గమనించి వాహనాన్ని నిలిపే ప్రయత్నం చేయగా అటవీశాఖ అధికారులను గమనించిన స్మగ్లర్లు కారును విడిచిపెట్టి పారిపోయారన్నారు. ఆ కారును పరిశీలించగా 446 కేజీల 15 ఎర్రచందనం దుంగలను గుర్తించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రేంజ్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ దాడులలో డిప్యూటీ రేంజ్ అధికారి గౌస్ కరీం, మామండూరు సెక్షన్ ఎఫ్బిఓలు శరవణ కుమార్, సుబ్రహ్మణ్యం, జాన్ శ్యాముల్ పాల్గొన్నారు.

నాగరాజుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : త్రినేత్ర పిరమిడ్ ధ్యాన మందిరం చీఫ్ అడ్వైజర్ డి నాగరాజు గత 25 సంవత్సరాలుగా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంటు ఆదర్శాలను తీసుకుని పిరమిడ్ నిర్మాణాలు, దక్షిణ మధ్య రైల్వే క్యారేజ్ రిపేర్ షాప్ లోని కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా ధ్యాన కార్యక్రమాలు, శాఖహర ప్రచారం చేస్తున్న సేవలను గుర్తించి గణతంత్ర దినోత్సవం సందర్భంగా క్యారేజ్ రిపేర్ షాప్ చీఫ్ వర్క్ షాప్ మేనేజర్ ఏ దేవసహాయం చేతులు మీదుగా అవార్డు అందుకున్నారు. ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు.

ప్రపంచీకరణతో వినాశనం

గాంధీ విగ్రహం ఎదుట సిఐటియు నిరసన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రపంచీకరణ విధానాలను నిరశిస్తూ ఆదివారం స్థానిక చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాంచివరం సురేంద్రన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా మండల కేంద్రాల్లో లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా రైతులకు గిట్టుబాటు ధరల కోసం దేశవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం కోటీశ్వరులకు అనుకూలంగా అనుసరించే విధానాలను మానుకోవాలన్నారు. ఈ దేశంలోని కార్మికులు కర్షకులు ఉత్పత్తి చేస్తున్న సంపదను కొంతమంది కోటీశ్వరులకు ధారాధత్వం చేయడానికి సురేంద్ర విమర్శించారు. రైతు సంఘం జిల్లా నాయకులు బంగారు మురళి మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు లేకుండా వారి వ్యవసాయాన్ని అగచాట్లు పాలు అయ్యేవిధంగా చేస్తున్న కేంద్ర ప్రభుత్వం వైఖరి నియంత్రత్వంగా ఉందని ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం కార్మికులకు కర్షకులకు న్యాయమైన హక్కులను కాపాడాలని అలా కాపాడని లేని పక్షంలో అన్ని ప్రజాసంఘాలతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా, ఉపాధ్యక్షులు గంగరాజు, ఆరోగ్య దాసు, వినోదు, రైతు సంఘం నాయకులు రామచంద్రన్ జ్యోతి పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు

కనీస మద్దతు ధర ప్రకటించాలి

- రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి
- రైతు, వ్యవసాయ సంఘాల డిమాండ్

పలమనేరులో నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి- పలమనేరు: రైతాంగ వ్యతిరేక విధానాలను కొనసాగిస్తే కేంద్ర ప్రభుత్వానికి రైతులు తగిన గుణపాఠం చెప్పక తప్పదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ. కాటమయ్య హెచ్చరించారు. గత 13 నెలల రైతాంగం ఢిల్లీ కేంద్రంగా నిర్వహించిన మహోద్యమం కేవలం క్షమాపణకే పరిమితం కాదని ఈసారి కేంద్ర ప్రభుత్వంను శాశ్వతంగా ఇంటికి సాగనంపుతామని పేర్కొన్నారు. సంయుక్త కిసాన్ మార్చా దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా కనీస మద్దతు చెల్లించాలని, అలాగే రైతు కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించాలని కోరుతూ ఆదివారం పలమనేరులో స్కూటర్ ర్యాలీని నిర్వహించారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ టి. జనార్ధన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉమాపతి నాయుడు మాట్లాడుతూ రైతాంగ ఉద్యమ ఫలితంగానే నేడు ప్రధాని మోడీ, ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రనేతల మద్దతుతో అధికారంలో కొనసాగుతున్నారని తెలిపారు. రైతులకు అన్ని పంటలకు కనీస గిట్టుబాటు ధర కల్పించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని పేర్కొన్నారు. జిల్లా రైతాంగానికి శాశ్వత కరువు నివారణకు హంద్రీ నీవా ప్రాజెక్టు సత్వరం పూర్తి చేయాలని, మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని, పాలు లీటర్‌కు రూ.50లు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఏనుగులు పంటలను నాశనం చేయడం, పలువురు రైతుల ప్రాణాలు తీస్తున్న నేపథ్యంలో శాశ్వత పరిష్కారం కోసం సోలర్ కంచె నిర్మాణం చేపట్టాలన్నారు. ఏఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.నాగరాజు, రైతు సంఘ జిల్లా నేత కె.మునిరత్నం నాయుడు, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి విజయ గౌరి, కార్మిక నాయకులు చెన్నకేశవులు, మంజునాథ్, సదాశివయ్య, శంకరప్ప, రవి, రఘ, రామ్మూర్తి, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపుపై చర్చించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- ఐరాల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజుని పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం ఉదయం కాణిపాకం శ్రీ వరసిద్ది వినాయక స్వామి దర్శనార్థం కాణిపాకంకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజుకి కాణిపాకం ఆలయ ఈవో పెంచల కిషోర్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ వేద మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా, ఆలయ ఈవో స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ డైరెక్టర్ విజయరామరాజుకి పుష్పగుచ్ఛం అందజేసి, నియోజకవర్గంలోని పాఠశాలల అభివృద్ధి గురించి చర్చించారు. ముఖ్యంగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల కొరతను తీర్చడం, విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం వంటి అంశాలపై దృష్టి సారించాలని కోరారు.

ఎమరాల్డ్స్ కళాశాలలో ఘనంగా స్పార్క్ 2025

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని నరసింహతీర్థం రోడ్డు మార్గం లో ఉన్న ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో స్పార్క్ 2025 పోటీలను కళాశాల యాజ మాన్యం ఘనంగా నిర్వహిం చింది.కళాశాలలో ఇంటర్మీడి య ట్ విద్యార్థిని, విద్యార్థుల ఆంగ్ల భాష ప్రావీణ్యాన్ని మరింతగా పెంపొందించడానికి ప్రతిఏటా స్పార్క్ అవార్డ్స్ పేరిట పోటీలను నిర్వహిస్తున్నామని ఎమరాల్డ్స్ డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్ లు తెలిపారు. ఈ స్పార్క్ అవార్డు పోటీలలో పాల్గొని విద్యార్థులకు వీడియో ప్రెజెంటేషన్, గ్రూప్ డిస్కషన్, ఎక్స్ టెంపర్ తదితర విభాగాలలో పోటీలను నిర్వహించామన్నారు. విద్యార్థులు విద్య అనంతరం వారికి ఉపాధి అవకాశాలను పొందడానికి, మెరుగైన ఆలోచనలను పెంపొందించుకోవడానికి ఈ పోటీలు ఎంతగానో దోహదపడతా యన్నారు. స్పార్క్ ఆఫ్ ది 2025గా నిరంజన్ రెడ్డి నిలిచి గెలుపొందాడని, ఇతనికి రూ.5 వేల రూపాయల నగదు బహుమతిని, ద్వితీయ స్థానంలో డింపుల్ కారుణ్య, తృతీయ స్థానంలో సుదేవి నిలిచి నగదు బహుమతులను అందుకున్నారు. ఈ పోటీల న్యాయ నిర్ణేతలుగా పాల్ సుధాకర్, సైమన్ శ్రీహరిలు వ్యవహరించగా, కళాశాల ఉపసంచాలకులు మునిరత్నం, జానకిరామ్, శ్రీనివాసులు, పార్థసారథి, నాథముని, ప్రిన్సిపాల్ మదనమోహన్, భానుకిరణ్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి: సిపిఎం

ఓజిలిలో..

ప్రజాశక్తి -నాగలాపురం: ఫిబ్రవరి 1,2,3 తేదీలలో నెల్లూరులో నిర్వహించనున్న సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్‌ను నాగలాపురం సుందరయ్య కాలనీలో సిపిఎం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడవ తేదీన నెల్లూరులో జరిగే సిపిఎం బహిరంగ సభకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కారత్, ఎంఎ బేబీ, బీవీ రాఘవులు , రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు కేంద్ర కమిటీ సభ్యులు పి మధు, ఎంఎ గఫూర్ తదితర అగ్ర నేతలు పాల్గొంటారని ఈ సభలకు నాగలాపురం మండలం నుంచి ప్రజలు, కార్మికులు, కర్షకులు, కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు అముదా, సుబ్బమ్మ, గౌస్యాబీ, అమృత ,రాణి పాల్గొన్నారు.

ఓజిలి : సిపిఎం 27 వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయా లని కోరుతూ సిఐటియు ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు బివి రమణయ్య పిలుపునిచ్చారు. ఓజిలి గ్రామంలో ఆదివారం సిఐటియు ఆటో యూనియన్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి.రమణయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విద్యుత్ చార్జీలు ట్రూ అప్ ఛార్జీలు తగ్గించాలంటూ ధర్నాలు చేసి అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని కల్ల బొల్లి మాటలు చెప్పిన కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోకుండా స్మార్ట్ మీటర్లు యథేచ్ఛగా బిగిస్తూ ప్రజలపై మరింత భారాన్ని మోపే దిశ గా అడుగులు వేస్తుండడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆటో స్టాండ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా షేక్ మహబూబ్ బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పసుపులేటి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఏ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి షేక్ జంషీద్ అహ్మద్, సహాయ కార్యదర్శి ఎం మహేష్, ట్రెజరర్ యం గౌతం కృష్ణ తోపాటు మరో ఏడు గురు కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

నాగలాపురంలో..

క్రైం న్యూస్

లారీ బోల్తా.. క్లీనర్ మృతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: అదుపుతప్పి బోల్తాబడ్డ లారీ క్లీనర్ మృతి డ్రైవర్‌కు గాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని మొగిలి ఘాట్లో చోటు చేసుకుంది. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సూరత్ నుండి చెన్నైకి వెళ్తున్న లారీ మొగిలి ఘాట్‌లో అదుపుతప్పి పక్కనే ఉన్న గోతిలోకి బోల్తా పడిందని తెలిపారు. ఈ సంఘటనలో రాజస్థాన్ చెందిన అశ్రిఫ్ అలియాస్ సోను (27) క్లీనర్ మృతి చెందగా, డ్రైవర్ అనిల్ మీనా (24) తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సోను మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతోపాటు డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కమిషనర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక పురపాలక సంఘ పరిధిలోని జంతువధ శాలలను, మాంసాహార హోటళ్లలో పురపాలక కమిషనర్ మంజునాథ్ గౌడ ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గణతంత్ర దినోత్సవ రోజున మాంసాహార క్రయవిక్రయాలు నగరంలో నిర్వహించకూడదని ప్రభుత్వ ఉత్తర్వులు ఉండడంతో కమిషనర్ ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వులు అతిక్రమించిన, అపరిశుభ్ర నిర్వహణ, నిల్వ ఆహార పదార్థాలు కలిగిన హోటళ్లకు జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్స్పెక్టర్ మునస్వామి సిద్ధు, పర్యావరణ, పారిశుద్ధ్య కార్యదర్శులు, శానిటేషన్ మేస్త్రీలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థినికి సన్మానం

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని కూరపర్తివారిపల్లి పంచాయతీ పల్లంవారిపల్లికి చెందిన విద్యార్థిని నాగస్వరం పవిత్ర 2023-24 విద్యా సంవత్సరానికి 10వ తరగతి పరీక్షల్లో 576 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించింది. ఇందుకు గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ విద్యార్థిగా ఆదివారం ఘనంగా సన్మానించారు. బోడెవండ్లపల్లి హైస్కూలులో పదవ తరగతిలో మంచి మార్కులతో రాణించి ఆదర్శంగా నిలిచినందుకు రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ అన్నాసముద్రం మధు, ఎంపిటీసీ ఈశ్వరమ్మ దంపతులు రూ.5 వేలు బహుమతిగా ఇచ్చారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ప్రథమ స్థానంలో నిలిచి ఉన్నత స్థాయికి ఎదగాలని మధు సూచించారు. విద్యార్థిని తల్లిదండ్రులు బుజ్జిబాబు, జ్యోతిని సన్మానించి మేమెంటో అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు టిడిపి నాయకులు వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన వైద్యశిబిరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని చియ్యవరం గ్రామంలో విష జ్వరాలు అదుపులోకి వచ్చాయి. వైద్యాధికారుల కృషితో అక్కడ సాధారణ పరిస్థితిలు నెలకొన్నాయి. దీంతో గణతంత్ర దినోత్సవం రోజు వైద్యాధికారులు శిబిరాన్ని ముగించారు. ఈ నెల 23వ తేదీన 'ప్రజాశక్తి'లో 'జ్వరం గుప్పెట్లో చియ్యవరం' అన్న వార్త ప్రచురితమైంది. స్పందించిన జిల్లా వైద్యాధికారి బాలకృష్ణ నాయక్ ఆదేశాల మేరకు చియ్యవరంలో వైద్యులు ఐదు రోజులపాటు శిబిరాన్ని నిర్వహించారు. మొత్తం 635 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 30 మందిని ఉన్నత వైద్యం కోసం రెఫర్ చేశారు. ప్రస్తుతం ఆ ముప్పై మందీ కోలుకున్నారనీ, గ్రామంలో ప్రస్తుతం సాధారణ పరిస్థితుల నెలకొన్నాయని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ మృదుల వాణి, కాసరం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ మాధవ్ తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-నాయుడుపేట : నాయుడుపేట పట్టణంలోని విన్నమాల గ్రామం నుండి కమ్మవారిపాలెం వరకు 4.30 కోట్ల రూపాయలతో తారు రోడ్డును సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల.విజయశ్రీ టిడిపి నాయకులతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. రోడ్డు శంకుస్థాపన అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని, సూళ్లూరుపేట నియోజకవర్గం లో అనేక రోడ్లు దుర్భర స్థితిలో ఉన్నాయని ఐదేళ్లుగా గ్రామాల్లో రోడ్లు పాడైపోయి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రతి గ్రామంలో రోడ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఏఎంసి చైర్మన్ శిరసనం భేటీ విజయభాస్కర్ రెడ్డి, నాయుడుపేట మండల టిడిపి అధ్యక్షులు సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, దార్ల రాజేంద్ర మరి కొంతమంది పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈఆర్‌వో కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు విద్యుత్ శాఖా ఈఆర్‌ఓ కార్యాలయాన్ని ఆదివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బద్దల వెంకట సుధీర్ రెడ్డి ప్రారంభించారు. విద్యుత్ శాఖా పాలనా సౌలభ్యం కోసం సుమారు రూ.2.25 కోట్ల వ్యయంతో ఈ కార్యాలయాన్ని నిర్మించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని తన చేతుల మీదుగా ఈఆర్వో కార్యాలయం ప్రారంభించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. విద్యుత్ శాఖాధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్యుత్ సంబంధిత సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఎస్ఈ సురేంద్ర నాయుడు, డీఈ వాసురెడ్డి, ఏడీలు సుధాకర్, సుబ్రహ్మణ్యం, ఏఈ బాలాజీ, టీడీపీ నేతలు గాలి మురళి నాయుడు, రావిళ్ల మునిరాజా నాయుడు పాల్గొన్నారు.